సాక్షి
విజయనగరం
శనివారం | 8 | జూలై | 2023



### మహానేతకు మనస్సుమాంజలి

సంక్షేమ, అభివృద్ధి పాలనకు ఆద్యుడు, మహానేత వైఎస్సార్ చేసిన మేలును ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజానీకం తలచుకుంటోంది. - 8లో



### అమ్మవారికి సారె

రాజాం సిటీ: వాసవీకన్యకాపరమేశ్వరికి వాసవీ క్లబ్ సభ్యులు శుక్రవారం 102 వంటకాలు, పట్టుచీరలతో కూడిన సారె సమర్పించారు.

### టీటీసీ పరీక్ష ఫలితాలు విడుదల

విజయనగరం ఫూల్‌బాగ్: టీటీసీ (టెక్నికల్ టీచర్ ట్రైనింగ్) సర్టిఫికెట్ కోర్సు అభ్యర్థులకు 2022, ఆగస్టులో నిర్వహించిన పరీక్ష ఫలితాలు విడుదలైనట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కడప, అనంతపురం కేంద్రాల్లో శిక్షణ పొందిన అభ్యర్థులు ఆయా కేంద్రాల్లో పాస్ సర్టిఫికెట్స్ తీసుకోవాలని కోరారు.

## న్యూస్‌రీల్

### శాకంబరిగా దుర్గాదేవి



అలమండలో శాకంబరిగా దుర్గాదేవి



జామిలో శాకంబరిగా వాసవీమాత

జామి: అలమండ బస్టాండ్ సమీపంలోని విజయదుర్గమాత ఆలయంలోని దుర్గామాత, కన్యకాపరమేశ్వరి ఆలయంలోని వాసవీమాత శాకంబరీ దేవిగా భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. అర్చకులు శర్మ, రవికుమార్‌లు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### ఐదుగురికి ఉద్యోగోన్నతి



ఉద్యోగోన్నతి పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: జెడ్పీలో విధులు నిర్వహిస్తున్న ఐదుగురికి ఉద్యోగోన్నతి కల్పిస్తూ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శుక్రవారం నియామక పత్రాలు అందజేశారు. నలుగురు జూనియర్ సహాయకులు, ఒక టైపిస్ట్‌ను సీనియర్ సహాయకులుగా నియమిస్తూ జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

### గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీ

విజయనగరం ఫూల్‌బాగ్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 5వ తరగతిలో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 11న బాలురుకు కొప్పెర్లలో, 12న బాలికలకు చీపురుపల్లి గురుకులాల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని జిల్లా సమన్వయ కర్త టి.పద్మజ శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల బాలబాలికలు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు. బాలురుకు 144, బాలికలకు 220 సీట్లు ఖాళీగా ఉన్నట్టు పేర్కొన్నారు.

# అదిగదిగో గిరిజన వర్సిటీ

విద్యలనగరంలో మరో విద్యామందిరం నిర్మితం కానుంది. ఇప్పటికే గిరిజన ఇంజినీరింగ్ కళాశాల, వైద్యకళాశాల నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన సాగుతుండగా.. కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ భవన నిర్మాణాలకు కొద్దిరోజుల్లో పునాదిరాయ పడనుంది. భూసేకరణ ప్రక్రియ ముగిసింది. భూమిని వర్సిటీ అధికారులకు అప్పగించే క్రతువు పూర్తయింది. రెండు రహదారుల నడుమ.. ఆహ్లాదకర వాతావరణంలో.. చదువుల నిలయం ఏర్పాటు పనులు చకచకా సాగుతున్నాయి.

- పూర్తయిన భూసేకరణ ప్రక్రియ
- 561.91 ఎకరాల భూమిని వర్సిటీ అధికారులకు అప్పగింత
- గిరిజన వర్సిటీ పనులకు అడుగులు
- భూములిచ్చిన చినమేడపల్లి, మర్రివలస రైతులకు రూ.30.57 కోట్ల పరిహారం చెల్లింపు
- కురుపాం సభలో ముఖ్యమంత్రి ప్రకటన తర్వాత మరింత జోరందుకున్న ప్రక్రియ

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రానికి వచ్చిన ప్రాజెక్టుల్లో ప్రధానమైనది గిరిజన విశ్వవిద్యాలయం. వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలను, గిరిజన ప్రజల ఆశలను తీర్చుతూ కార్యరూపం దాల్చిన ఈ ప్రాజెక్టు పనుల్లో తాజాగా జోరు పెరిగింది. విశ్వవిద్యాలయం నిర్మాణానికి, ఇతర వసతుల కల్పనకు ప్రతిపాదించిన 561.91 ఎకరాల భూసేకరణ ప్రక్రియ పూర్తయింది. ఈ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.37.45 కోట్లు కేటాయించింది. సహజ సిద్ధమైన చెరువులు, నీటి గుంతలు పోగా నిర్మాణానికి అనువైన 519 ఎకరాల భూమిని ఈ నెల ఆరోతేదీన యూనివర్సిటీ యాజమాన్యానికి జిల్లా యంత్రాంగం అప్పగించింది. ఇటీవల కురుపాం సభలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి త్వరలోనే జిల్లాకు మళ్లీ వస్తాను.. గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనలో భాగస్వామ్యం అవుతానని ప్రకటించడంతో ఇక్కడ ప్రక్రియలో మరింత వేగం పెరిగింది. వర్సిటీ తరగతులను 2019 నుంచి విజయనగరం జిల్లా కేంద్రంలోని తాత్కాలిక భవనాల్లో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.



గిరిజన వర్సిటీ ఏర్పాటుపై ఇటీవల వీసీ కట్టిమణితో చర్చిస్తున్న కేంద్ర బృందం



విశ్వవిద్యాలయం నిర్మించేచోట భూముల మ్యాప్‌ను చూస్తున్న కేంద్రం బృందం (ఫైల్)

#### సమష్టిగా ముందుకు...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాలూరు నియోజకవర్గంలోని అచ్చమైన గిరిజన ప్రాంతంలోనే కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఈ మేరకు డిప్యూటీ కలెక్టర్ హోదాలోని అధికారులు భూసేకరణ ప్రక్రియలో సమష్టిగా శ్రమించారు. భూసేకరణను పూర్తిచేశారు. ఎన్నో ఏళ్ల నాటి కల సాకారమవుతుందనే సంతోషం అటు గిరిజనులు, ఇటు మైదాన ప్రాంత ప్రజల్లో వ్యక్తం అవుతోంది.

#### ఆహ్లాదకరమైన వాతావరణం

విశ్వ విద్యాలయం నిర్మాణానికి సంబంధించి మెంటాడ, దత్తిరాజేరు మండలాల పరిధిలో సేకరించిన భూమిలో దాదాపు 80 శాతం ప్రభుత్వ భూమే ఉండడం గమనార్హం. మెంటాడ మండలం చినమేడపల్లి పరిధిలో 155.44 ఎకరాలు, దత్తిరాజేరు మండలం మర్రివలస పరిధిలో 391.17 ఎకరాల భూమి ప్రభుత్వానికి చెందినదే. రెండు గ్రామాల రైతులకు చెందిన జిరాయితీ భూమి 67.30 ఎకరాలు మాత్రమే ఉంది. మొత్తం భూమిలో 42.88 ఎకరాలు చెరువులు, నీటి గుంతల రూపంలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. సహజ సిద్ధంగా ఉన్న చెరువులను, నీటి గుంతలను అలాగే ఉంచి భవన నిర్మాణాలు చేపడతారని అధికారులు పేర్కొన్నారు. 2023 జూన్ మాసంలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెం.265 ప్రకారం భూసేకరణ, నష్ట పరిహారపు చెల్లింపు ప్రక్రియను పూర్తి చేసినట్టు అధికారులు వివరించారు.

#### సజావుగా భూసేకరణ ప్రక్రియ



అనుకున్న సమయానికి భూమిని అప్పగించడంలో అధికారులు సమష్టిగా సమన్వయంతో కృషి చేశారు. చినమేడపల్లి, మర్రివలస గ్రామాల రైతులు కూడా సానుకూలంగా స్పందించి పూర్తి సహకారం అందించారు. ఎలాంటి సమస్యలు లేకుండా ప్రక్రియను సజావుగా నిర్వహించాం. అధికారులు, కింది స్థాయి సిబ్బంది, రైతులు అందించిన సహకారం అభినందనీయం. అర్హత కలిగిన రైతులందరికీ నిబంధనల ప్రకారం నష్ట పరిహారం చెల్లించాం. – ఎస్.నాగలక్ష్మి, జిల్లా కలెక్టర్, విజయనగరం

#### మంత్రి చొరవ...

చినమేడపల్లి, మర్రివలస గ్రామాలకు చెందిన 99 రైతులు 67.30 ఎకరాల భూమిని అప్పగించగా ప్రభుత్వం రూ.10.47 కోట్ల పరిహారం చెల్లించింది. మంత్రి బొత్స సత్యనారాయణ చొరవతో డి.పట్టాదారులైన 279 మందికి కూడా ప్రభుత్వం రూ.13.92 కోట్లు పరిహారం అందించింది. అలాగే, ఎలాంటి హక్కు పత్రాలు లేకుండా అనుభవదారులైన రైతులకు కూడా రూ.5.58 కోట్లు చెల్లించడం గమనార్హం. అర్హత కలిగిన ఏ ఒక్క రైతుకూ నష్టం కలగకుండా.. విద్యా శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్ సహకారం, చొరవతో నిర్ణీత సమయంలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసినట్టు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. మొత్తం భూసేకరణ ప్రక్రియ, ఇతర అవసరాల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ.37.45 కోట్లు కేటాయించింది. ఇందులో ఇప్పటికే భూములప్పగించిన రైతు సోదరులకు రూ.30.57 కోట్లు పరిహారం కింది చెల్లించింది.

## పునరావాసం కల్పిస్తాం

- అటవీ సిబ్బందిపై దాడిచేయడం హేయనీయం
- డీఎఫ్‌ఓ ఎస్.వెంకటేష్

మెరకముడిదాం: మండలంలోని పులిగుమ్మి ప్రాంతంలో అటవీ భూముల ఆక్రమణలు అడ్డుకునేందుకు వెళ్లిన అటవీ సిబ్బందిపై దాడి చేయడం దారుణమని జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.వెంకటేష్ అన్నారు. పులిగుమ్మి ప్రాంతంలో కొంతమంది అటవీభూములను ఆక్రమించి తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారు. సమాచారం తెలుసుకున్న అటవీ సిబ్బంది పోలీస్‌శాఖ సహకారంతో శుక్రవారం పులిగుమ్మి ప్రాంతానికి చేరుకున్నారు. అక్రమణదారులతో అటవీ సిబ్బంది మాట్లాడుతుండగా, వారంతా ఒక్కసారిగా దాడిచేశారు. కొందరు సిబ్బంది గాయపడినట్టు డీఎఫ్‌ఓ తెలిపారు. పర్యావరణానికి, మానవమనుగడకు ఆధారమైన అటవీప్రాంతాన్ని ఆక్రమించి, సహజ వనరులకు హానితలపెట్టడం సరికాదన్నారు. అవసరమైతే ఉన్నతాధికారులతో మాట్లాడి పునరావాసం కల్పిస్తామన్నారు. దాడి ఘటనపై బుదరాయవలస, బాడంగి పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ బి.అప్పలరాజు, డీఆర్వో ప్రహ్లాదరావు, ఎస్ఎస్‌ఓ కేవీఎస్ రాజు, కేశవరావు పాల్గొన్నారు.



ఆక్రమణలు తొలగించకుండా అటవీ సిబ్బందిని అడ్డుకుంటున్న ఆక్రమణదారులు

## ఆదివాసీల సంక్షేమానికి కృషి చేస్తా

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు



డాక్టర్ డివిజి శంకరరావును సత్కరిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

పార్వతీపురం టౌన్/విజయనగరం: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా మాజీ ఎంపీ డాక్టర్. డీవీజీ శంకరరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జెడ్పీ కార్యాలయంలో ఆయనను డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దుశ్శాలువతో సత్కరించారు. డీవీజీ శంకరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ఉన్నతమైన, బాధ్యత కలిగిన రాజ్యాంగపరమైన పదవికి ఎంపిక చేయడం అదృష్టంగా భావిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధికి చిత్త శుద్ధితో కృషి చేస్తానని తెలిపారు. రెండేళ్ల కిందట ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితుడైన వైఎస్సార్ సీపీలో చేరినట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, చనుమల్ల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

| డీవీజీ శంకరరావు బయోడేటా | |
|---|---|
| పేరు | డాక్టర్ దాడిచిలుక వీర గౌరీశంకరరావు |
| తల్లిదండ్రులు | మంగమ్మ, సాంబమూర్తి(లేటు) |
| పుట్టిన తేదీ | 30-04-1968 |
| కులము | కొండదొర (ఎస్టీ) |
| జన్మస్థలం | పాలికవలస, సాలూరు నియోజకవర్గం, పార్వతీపురం మన్యం జిల్లా |
| విద్యార్హతలు | ఎంబీబీఎస్, ఎండీ ఆంధ్రామెడికల్ కళాశాల |
| ఫ్యామిలీ వివరాలు | భార్య స్వర్ణలత, ఎమ్మెస్సీ న్యూట్రీషన్ |
| పిల్లలు | కుమార్తె డా.డీవీ గాయత్రి స్మిత (ఎంబీబీఎస్) |
| కుమారుడు | డి. శివలలిత్ |
| పొలిటికల్ కేరీర్ | వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ జోనల్ ఇన్‌చార్జ్ |
| | శ్రీకాకుళం నియోజకవర్గ పరిశీలకులు |
| | గతంలో అరకు పార్లమెంటరీ ఎంపీ |
| | 2014లో టీడీపీకి రాజీనామా |
| పర్సనల్ డీటేల్స్ | నెల్లిమర్ల నిమ్స్ కళాశాలల్లో అనస్థీషియా విభాగంలో ప్రొఫెసర్ |
| రచయితగా | తెలుగు, ఇంగ్లీష్ భాషలలో 4వేలు పద్యాలు రచన, 300 పద్యాలు, 35 కథలు తెలుగులో ప్రచురణ |

## దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: జాతీయ అవార్డుల కోసం జిల్లాలోని దివ్యాంగులకు సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతుల హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు జీవీబీ జగదీష్ శుక్రవారం తెలిపారు. సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వశాఖ న్యూఢిల్లీ ఈ మేరకు ప్రకటన జారీచేసిందన్నారు. అర్హత, ఆసక్తి గల వారు 'అవార్డ్స్.జీఓవి.ఐఎన్' వెబ్ సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## సుస్థిర అభివృద్ధే ప్రధానం

విజయనగరం అర్బన్: మహిళాశిశు సంక్షేమంలో ప్రభుత్వం నిర్దేశించిన సుస్థిర లక్ష్యాల సాధనలో సిబ్బంది మరింత సమర్థవంతంగా పనిచేసేలా పర్యవేక్షించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆ శాఖ ప్రాంతీయ అధికారులకు సూచించారు. అంగన్‌వాడీల ద్వారా మహిళలు, పిల్లలకు సక్రమంగా పోషకాహారం అందేలా చూడాలన్నారు. ఆరోగ్య జీవనానికి కృషిచేయాలన్నారు. మహిళాశిశు సంక్షేమశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు చిన్మయిదేవి కలెక్టర్ నాగలక్ష్మిని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం కలిశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న నాడు–నేడు పనులు, కార్యకర్తల నియామకాలపై కలెక్టర్ ఆమెతో చర్చించారు. అనంతరం జాయింట్ డైరెక్టర్ తమ శాఖ సిబ్బందితో ఆన్‌లైన్ సమావేశం నిర్వహించి నాడు–నేడు పనుల నిర్వహణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, ప్రీ స్కూల్ అటెండెన్స్, స్పాట్ ఫీడింగ్ అంశాలపై సమీక్షించారు. సమావేశంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శాంతకుమారి పాల్గొన్నారు.



కలెక్టర్ నాగలక్ష్మిని కలిసిన మహిళాశిశు సంక్షేమశాఖ ప్రాంతీయ జేడీ చిన్మయిదేవి

# సమస్యల ప్రస్తావన.. చర్చ.. పరిష్కారం..

**వేదిక :** జిల్లా పరిషత్ కార్యాలయం

**సమావేశం:** జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

**హాజరైన వారు:** రాష్ట్ర డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లాకు చెందిన శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, మండలాధ్యక్షులు.

**సమావేశం నిర్వహణ తీరు:** వాస్తవంగా సభ్యులంతా అధికార వైఎస్సార్ సీపీకి చెందినవారే. ప్రజా సమస్యలపై బాహాటంగా మాట్లాడాల్సిన అవసరం లేదు. అంతర్గతంగా సర్దుబాటు చేసుకునే అవకాశం ఉంది. అయితే, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధానమని గుర్తించారు. జిల్లాలో నెలకొన్న అనేక సమస్యలను వారే ప్రస్తావించి.. చర్చించి... ఆ సమస్యలకు చక్కని పరిష్కారం చూపారు. ఇంతకు ముందు ఎన్నడూ ఏ ప్రభుత్వంలో జరగని రీతిలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది.



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్ససత్యనారాయణ

- ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా సాగిన జెడ్పీ సర్వసభ్యసమావేశం
- ప్రాధాన్యతా భవనాలను వెంటనే ప్రారంభించాలి: మంత్రి బొత్స
- చివరి ఆయకట్టుకూ సాగునీరు

విజయనగరం గంటస్తంభం: విజయనగరం ఉమ్మడి జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టుల నుంచి చివరి ఆయకట్టు వరకు సాగునీరు నీరు సరఫరా చేయాలని, ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలను వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. నిర్మాణం పూర్తయిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల భవనాలను ప్రారంభించాలన్నారు. విజయనగరం మండలంలో మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని, గరుగుబిల్లి, బలిజిపేట మండలాలను పార్వతీపురం విద్యుత్ డివిజన్ పరిధిలో చేర్చేందుకు సభ తీర్మానం చేసింది.

#### విత్తనాలు, ఎరువులు సిద్ధం

ఈ ఏడాది ఖరీఫ్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధం చేశామని వ్యవసాయ శాఖ, జలవనరుల శాఖలపై సమీక్ష సందర్భంగా మంత్రి బొత్స చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే, ఈ ఏడాది జూన్ నెలలో ఉమ్మడి జిల్లాలో సుమారు 50 శాతం వరకు లోటు వర్షపాతం ఉందన్నారు. ఏ మండలానికైనా అదనంగా విత్తనాలు కావాలంటే సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. తోటపల్లి ప్రాజెక్టు భూసేకరణను వెంటనే పూర్తి చేయాలని, బిల్లులు వెంటనే చెల్లించాలని అధికారులను ఆదేశించారు.

#### నెలాఖరుకు వీఆర్ఎస్ నీరు విడుదల

జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, జులై నెల ప్రారంభం నుంచి వర్షాలు సమృద్ధిగానే పడుతున్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తోటపల్లి ప్రాజెక్టు నుంచి 40 రోజుల ముందుగానే నీటిని విడుదల చేశామని తెలిపారు. శివారు భూములకు సాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. వర్షాలు బాగా కురిస్తే, ఈ నెలాఖరుకు వెంగళరాయసాగర్ నుంచి నీటిని విడుదల చేస్తామని తెలిపారు. ఈ క్రాప్ నమోదులో తప్పులు దొర్లకుండా చూడాలని వ్యవసాయ అధికారులకు సూచించారు.

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పార్వతీపురం మన్యం జిల్లాలోని పలు సమస్యలను ప్రస్తావించారు. పాచిపెంట పీహెచ్‌సీలో డిప్యుటేషన్ రద్దు చేయాలని కోరారు.
- కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి మాట్లాడుతూ రేగిడిగెడ్డలోని 14 మంది రైతులకు పెండింగ్‌లో ఉన్న పరిహారం వెంటనే విడుదల చేయాలని కోరారు. వ్యక్తిగత ఇళ్లను మంజూరు చేయాలని విజ్ఞప్తిచేశారు. పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు బిల్లుల సమస్యను ప్రస్తావించారు.
- రాములవలస, లోచర్లకు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు మంజూరు చేయాలని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కోరారు. మదుములు, స్లూయిస్‌లు బాగుచేయాలన్నారు.
- గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మాట్లాడుతూ చెరువులు, కాలువల పనులన్నీ పూర్తయ్యాకే నీటిని విడుదల చేయాలన్నారు. గంట్యాడ మండలంలో జాతీయ రహదారి నిర్మాణ సమయంలో సాగునీటి కాలువలను మూసివేశారని, దీనిపై చర్య తీసుకోవాలని కోరారు. సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.
- ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ ఎస్.కోటలో చిలకలగెడ్డ, జె.ఎ.చానల్‌లో భూ ఆక్రమణలు తొలగించాలని కోరారు.
- పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో సుమారు రూ.2.2 కోట్ల మేరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. దీనిపై మంత్రి స్పందిస్తూ వెంటనే విడుదల చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.
- రాజాం, రేగిడి ఆమదాలవలస మండలాల్లో పూర్తయిన ఇళ్లు, రోడ్ల బిల్లులు చెల్లించాలని అధికారులను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కోరారు.
- విద్యుత్, పౌర సరఫరాలు, వైద్యా రోగ్యం తదితర ఇతర అంశాలపై చర్చించారు. ఎమ్మెల్సీ సురేష్‌బాబు మాట్లాడుతూ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో ఇన్‌చార్జి వార్డెన్ల వల్ల ఎదురవుతున్న సమస్యలను ప్రస్తావించారు. పలువురు ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు వారి మండలాలకు చెందిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి, ఎమ్మెల్యే జోగారావు కోరిక మేరకు గరుగుబిల్లి, బలిజిపేట మండలాలను పార్వతీపురం విద్యుత్ సబ్‌డివిజన్‌లో చేర్చడానికి సభ తీర్మానించింది. విజయనగరం మండలంలో మరో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సమావేశంలో ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు నాగలక్ష్మి, నిషాంత్ కుమార్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్, రెండు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

#### పేదలకు పొజిషన్ పట్టాలు

ఇళ్లు కట్టుకొని నివసిస్తున్న పేదలకు పొజిషన్ పట్టాలు ఇవ్వాలని మంత్రి బొత్స అధికారులకు సూచించారు. విజయనగరం జిల్లాలో సుమారు 77 వేలు, మన్యం జిల్లాలో 27,000 ఇళ్లను మంజూరు చేసినట్టు హౌసింగ్‌పై జరిగిన చర్చ సందర్భంగా గృహనిర్మాణ శాఖాధికారులు తెలిపారు. ప్రస్తుతం సిమెంట్, ఇతర నిర్మాణ సామగ్రికి కొరత లేదని వివరించారు.

#### సంతృప్తికర స్థాయిలో తాగునీరు

ఇంటింటికీ కొళాయి వేయడం ద్వారా సంతృప్తికర స్థాయిలో తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, జలజీవన్ మిషన్‌పై జరిగిన చర్చ సందర్భంగా జెడ్పీ చైర్మన్ స్పష్టం చేశారు. జలజీవన్ మిషన్ ప్రగతిని, పథకం వివరాలను రెండు జిల్లాల ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వివరించారు. తన నియోజకవర్గం పరిధిలో రూ.200 కోట్ల మేర పనులు పెండింగ్‌లో ఉన్నాయని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సభ దృష్టికి తెచ్చారు. ట్యాంకులు, అదనపు జలవనరులు గుర్తించడంతో పాటు పైప్‌లైన్ పనులు నాణ్యతతో చేపట్టాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎంపీ బెల్లాన సభలో అధికారులను కోరారు.



జెడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు



## క్లుప్తంగా

### సమస్యల పరిష్కారానికే వెల్ఫేర్ డే


సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహిస్తున్నామని ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం జిల్లాలో పనిచేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే చర్యలు చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోలీసుల అభ్యున్నతికి తామెప్పుడూ ముందుంటామన్నారు. పదోన్నతులు, రావాల్సిన బకాయిలు, బదిలీలపై సమస్యలను సిబ్బంది వివరిస్తున్నారని, వాటిన్నంటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### లక్ష్మీపేట కోర్టును పరిశీలించిన జడ్జి ఫణికుమార్


కోర్టు ఆవరణలో జడ్జి ఫణికుమార్, పోలీసులు

వంగర: మండల పరిధి లక్ష్మీపేట ప్రత్యేక న్యాయస్థానాన్ని జడ్జి ఫణికుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులతో కలిసి కోర్టు పరిసరాలు, ఇక్కడ ఉన్న సౌకర్యాలను పరీక్షించారు. కార్యక్రమంలో రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు, తహసీల్దార్ డి.ఐజాక్, ఎస్సై ఆర్.జనార్దనరావు ఉన్నారు.

### జీసీఎస్ఆర్ కళాశాలలో నాక్ బృందం


రాజాం కళాశాలలో వివరాలు సేకరిస్తున్న నాక్ బృందం

రాజాం: పట్టణంలోని జీఎంఆర్ విద్యాసంస్థలకు చెందిన జీసీఎస్ఆర్ కళాశాలను నాక్ బృందం శుక్రవారం పరిశీలించింది. ఐదు సంవత్సరాల నుంచి ఇప్పటివరకూ కళాశాలలో నిమౌలికవసతులు, సదుపాయాలు, బోధన తదితర అంశాలపై సభ్యులు ఈ సందర్భంగా ఆరాతీశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పోటీ ప్రపంచంలో అవసరమైన విద్యను సాంకేతిక విజ్ఞానంతో మిళితం చేసి అందించాలని లెక్చరర్లకు సూచించారు. కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలిసి అభిప్రాయాలు తీసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పురుషోత్తంరావు, ఐక్యూ ఏసీ కన్వీనర్ మురపాక రమేష్, ఉపాధి కల్పనాధికారి సీహెచ్.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### డిజిటల్ శిక్షణతో మెరుగైన విద్య


డిజిటల్ శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు

రాజాం: ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులకు నాణ్యమైన బోధన అందించేందుకు అవకాశం ఉంటుందని డిజిటల్ శిక్షణ రాష్ట్ర పరిశీలకుడు విశ్వేశ్వరయ్య అన్నారు. శుక్రవారం రాజాంలోని జీఎంఆర్ఐటీలో జరుగుతున్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్స్ శిక్షణను ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు అంశాల గురించి వివరించారు. ప్రభుత్వం చేస్తున్న కృషికి మనందరం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ ఆర్.మురళీకృష్ణ, ఫెసిలిటేటర్స్ కుమరాపు చంద్రునాయుడు, సీహెచ్.కృష్ణప్రసాద్, ట్రైనర్స్ సతీష్, రవికిశోర్, అదనపు కోర్సు డైరెక్టర్ గంగునాయుడు, రాజాం, సీతంపేట, వీరఘట్టం, జియమ్మవలస మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





# మహానేతకు మనస్సుమాంజలి

ఆరోగ్య ప్రదాత, జలయజ్ఞం రూపకర్త, అభాగ్యులు, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన నేత, పాలనలో వైవిధ్యం చూపించి అట్టడుగు వర్గాల అక్కచెల్లెమ్మలను లక్షాధికారులను చేస్తానని ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మహానాయకుడు ఎవరు? అని ఎవరిని అడిగినా వారి నోటి వెంట తక్కున వచ్చే పేరు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి . తన ప్రజారంజక పాలనతో కోట్లాది మంది హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి నేడు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రిగా తన పాలనలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు అందించిన సేవలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

-విజయనగరం ఫోర్ట్/గరుగుబిల్లి/ పాలకొండ,పాలకొండ రూరల్

- నేడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి
- ఆనాటి సేవలను గుర్తు చేసుకుంటున్న జిల్లా ప్రజలు


పాలకొండ: తోటపల్లి ప్రాజెక్టు

### ఆరోగ్య ప్రదాత

పేదోడికి జబ్బు వస్తే చాలు 2004వ సంవత్సరానికి ముందు ప్రాణాల మీద ఆశవదులుకునేవారు. కొంతమంది ఉన్న ఇంటిని, పొలాన్ని తాకట్టుపెట్టి గాని, అమ్ముకుని కానీ వైద్యం చేయించుకునేవారు. వైద్యం చేయించుకునే స్థోమత లేని వారు మంచం పైనే మగ్గిపోయి తనువు చాలించేవారు. ఇటువంటి దయనీయ పరిస్థితులను తన పాదయాత్రలో చూసి చలించిన దివంగత నేత వైఎస్. రాజశేఖరెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం కింద తెలుపు రేషన్ కార్డు కలిగిన వారికి ఆరోగ్యశ్రీ కార్డులు అందించారు. ఆరోగ్యశ్రీ కార్డు పట్టుకుని ప్రభుత్వ ఆస్పత్రికి అయినా, కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లినా ఉచితంగా చికిత్స అందించేవారు. అంతేకాకుండా ఇంటికి వెళ్లడానికి ప్రయాణ చార్జీలు కూడా ఇచ్చేవారు. కార్పొరేట్ ఆస్పత్రి వైపు ఎప్పుడూ కన్నెత్తి చూడని పేదవారు ఆరోగ్యశ్రీ కార్డు చూపిస్తే చాలు స్వాగతం పలికి మరీ వైద్యం చేసేవారు.

### జలయజ్ఞం రూపకర్త

విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల రైతులకు సాగునీరందించేందుకు దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత రూపకల్పన చేసిన జలయజ్ఞంలో భాగంగా నాగావళినదిపై తోటపల్లి ప్రాజెక్టును రూ.450.23కోట్లతో నిర్మించేందుకు పాలనా అనుమతులిచ్చారు. ప్రాజెక్టులో 2.5 టీఎంసీ నీటిని నిల్వ ఉంచి తోటపల్లి రెగ్యులేటర్ పరిధిలోని కాలువలద్వారా సరఫరా అవుతున్న పాత ఆయకట్టు 64 వేల ఎకరాలతోపాటు అదనంగా లక్షా 20వేల ఎకరాల పంటపొలాలకు సాగునీరు అందించేందుకు లక్ష్యంగా చేసుకుని నిర్మాణం ప్రారంభించారు. పల్లెబాటలో భాగంగా 2004 అక్టోబర్ 17న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తోటపల్లి ప్రాజెక్టుపనులను స్వయంగా పరిశీలించి అధికారులను అప్రమత్తం చేసి వేగవంతం చేశారు. అలాగే గరుగుబిల్లి మండలం నందివానివలస గ్రామంలో నిర్మించిన పునరావాస ఇళ్ల సముదాయాన్ని ప్రారంభించి నిర్వాసితులకు మంజూరు చేశారు.


విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స పొందుతున్న రోగులు

### రాజాంలో ఆస్పత్రి ఏర్పాటు

రాజాం: రాజాం నియోజకవర్గం మీదుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2003లో పాదయాత్ర నిర్వహించారు. అప్పట్లో విజయనగరం జిల్లా నుంచి శ్రీకాకుళం జిల్లా రాజాం నియోజకవర్గం ఒమ్మి పంచాయతీ వద్ద అడుగుపెట్టారు. రాజాం ప్రధాన రహదారిమీదుగా నడిచిన వైఎస్సార్ రోడ్డు పక్కనే ఉన్న రాజాం ప్రభుత్వ ఆస్పత్రిని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాజాం ఆస్పత్రిని 60 పడకల సామాజిక ఆస్పత్రిగా రూపకల్పనచేశారు. రూ. 40 లక్షలు అప్పట్లో విడుదలచేసి పలు పరికరాలు కొనుగోలుచేయించారు. వైద్యుల సంఖ్యను పెంచి రోగులకు అధునాతన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. అనంతరం ఆస్పత్రిని వందపడకల ఆస్పత్రిగా మార్చే ప్రతిపాదనలు చేసి నిధులు సమకూర్చారు.

#### ఆరోగ్యశ్రీ చాలా గొప్ప పథకం



ఆరోగ్యశ్రీ పథకం చాలా గొప్పది. దివంగత ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన ఈ పథకం వల్ల ఎంతో మంది పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారు ఉచితంగా వైద్య సేవలు పొందుతున్నారు. నాటి పథకంలో నేడు 3వేలకు పైగా వ్యాధులకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స అందిస్తున్నాం.

– డాక్టర్ ఉప్పు అప్పలరాజు, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్

#### ఇచ్చిన మాటకు కట్టుబడే మహామనిషి



2004లో రాజశేఖరరెడ్డి సీఎం అయ్యేటప్పటికి కొత్తూరు నియోజకవర్గం ఉండేది.వీరఘట్టం, సీతంపేట, భామిని, కొత్తూరు మండలాలు ఈ నియోజకవర్గంలో ఉండేవి. నేను వీరఘట్టం జెడ్పీటీసీగా గెలుపొందాను. అప్పట్లో జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి గట్టి పోటీ ఏర్పడింది.అయితే ఆ మహానుభావుడి ఇచ్చిన మాటతో నేను 2005లో జిల్లా పరిషత్ చైర్మన్‌గా పదవి చేపట్టి ఆయన పాలనలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగలిగాను.

– పాలవలస రాజశేఖరం, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్


రాజాం: అభివృద్ధి చేసిన ఏరియా ఆస్పత్రి

#### ఆకట్టుకున్న నఖచిత్రం


దివంగత రాజశేఖరరెడ్డి నఖచిత్రం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా గరుగుబిల్లి మండలంలోని నాగూరుకు చెందిన నఖచిత్ర కారుడు పల్ల పరిశినాయుడు, రాజశేఖరరెడ్డి నఖచిత్రాన్ని వేశారు. ఈ చిత్రం పలువురు అభిమానులను ఆకర్షించింది.

#### వైఎస్సార్ చాలా చేశారు

వైఎస్ రాజశేఖర్ రెడ్డి అంటే రాజాం ప్రజలకు ఎంతో ఇష్టం. ఈ ప్రాంతాన్ని బాగా అభివృద్ధి చేశారు. రాజాం సామాజిక ఆస్పత్రిని అభివృద్ధి చేయడంతో పాటు పట్టణాన్ని మున్సిపాల్టీగా గుర్తించారు. మడ్డువలస ప్రాజెక్ట్ కాలువల ఆధునికీకరణ చేయించి ప్రారంభించారు. నారాయణపురం ఆనకట్ట ఆధునికీకరణ పనులు చేసి, వాసుదేవపట్నం వద్ద యూటీ నిర్మించారు. పోతులజగ్గుపేట–నారాయణపురం గ్రామాల మధ్య నాగావళి నదిపై వంతెన నిర్మించారు. ప్రతి మండలానికి పీహెచ్‌సీలు ఏర్పాటు చేసి, అందరికీ ఆరోగ్యశ్రీ అమలు చేయించారు.

– పాలవలస శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్, రాజాం.

#### ఆరోగ్యశ్రీతో మరో జన్మ

దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ నాకు ప్రాణభిక్ష పెట్టింది. ఉమ్మడి రాష్ట్రంలో మొదటి గుండె ఆపరేషన్ నాదే. మధ్యతరగతి కుటుంబానికి చెందిన నేను తొలి నుంచి టీడీపీ అభిమానిని. నాడు పాలకొండ పట్టణం 12వ వార్డు జన్మభూమి కమిటీ సభ్యుడిగా చేశాను. పార్టీపరంగా టీడీపీ అయినా ఆ మహానుభావుడు అందించిన పథకంతో నేడు కుటుంబసభ్యుల మధ్య ఎంతో ఆనందంగా ఉన్నాను. 2005లో నా గుండెలో రక్తనాళాలు మూసుకుపోవడంతో తీవ్ర ఇబ్బంది పడ్డాను. నా ముగ్గురు పిల్లలు, భార్య దేవకి భవిష్యత్ తలుచుకుని ఆవేదన చెందాను. అప్పటి సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ నాకు మరో జన్మ అందించింది. అప్పట్లో విశాఖ కేర్ ఆస్పత్రిలో వైద్యుడు కె.దామోదరరావు గుండెకు శస్త్ర చికిత్స చేశారు. సంవత్సర కాలం మందులు, వైద్యపరమైన పరీక్షలు ఉచితంగానే అందించారు.

– ఆనంద్ చౌదరి



## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


వాతాడ రాజశేఖర్ (ఫైల్)

డెంకాడ: మండలంలోని కాంపెక్స్ సమీపంలో నిర్మాణంలో ఉన్న టీడీపీ కార్యాలయం ఆవరణలో చొల్లంగి పేటకు చెందిన వాతాడ రాజశేఖర్ (34) మృతదేహం అనుమానాస్పదంగా పడి ఉంది. వివరాలిలా ఉన్నాయి. రాజశేఖర్ కుమిలిలో ఒక బ్యాంకుకు సంబంధించి మినీబ్యాంకు నిర్వహణతో పాటు బ్యాంకులో హెల్పర్‌గా ప్రైవేట్‌గా పని చేస్తున్నాడు.గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన రాజశేఖర్ తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం శవమై పడి ఉన్నాడు. ఊపిరి ఉందేమో అని డెంకాడ పీహెచ్‌సీకి కుటుంసభ్యులు తీసుకువచ్చే సమయంలోనే గమనించిన వైద్యసిబ్బంది ఆస్పత్రి బయటకు వెళ్లి చూసి అప్పటికే మరణించాడని నిర్ధారించారు. రాజశేఖర్ మృతదేహం వద్ద తల్లిదండ్రులు అప్పలరాజు, లక్ష్మికుమారిలు,బంధువులు బోరున విలపించారు. అత్త వారింటికి వెళ్తానని చెప్పి బయల్దేరాడని కుటుంబ సభ్యులు చెబుతున్నట్టు ఎస్సై తెలిపారు. పోలీసులు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి ముఖంపై చిన్నపాటి కమిలిన గాయాలు ఉన్నాయి. ఎవరైనా కొడితే గాయాలయ్యాయా? మృతదేహం చాలా సేపు నేలపై ఉండడం వల్ల అలా జరిగిందా? అన్నది తెలియాల్సి ఉంది. ఈ మృతికి గల కారణాలపై అన్ని కోణాల్లో ఆరా తీస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

**చికిత్స పొందుతూ ఒకరు..**

పాలకొండ రూరల్: మండలంలోని సిరికొండ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్సపొందుతూ ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. రాజాం నియోజకవర్గం జి.సిగడాం గ్రామానికి చెందిన డిగ్రీ రెండవ సంవత్సరం విద్యార్థి ఊశెట్టి సురేష్ (22), ఆదే గ్రామానికి చెందిన తన స్నేహితుడు నాగవరపు కృష్ణతో కలిసి ద్విచక్రవాహనంపై పాలకొండ మీదుగా సీతంపేట పార్కుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న నాలుగు చక్రాల వాహనం ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంపై నుంచి కింద పడడంతో తల, కాళ్లకు తీవ్రంగా గాయాలవడంతో వారిని తొలుత పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం శ్రీకాకుళం తీసుకువెళ్లగా ఆస్పత్రిలో సురేష్ మరణించాడు. స్నేహితుడు ప్రస్తుతం అపస్మారక స్థితిలో ఉన్నట్లు ఎస్సై బి.శివ ప్రసాద్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామని చెప్పారు.

## పదో తరగతి ఫెయిలైన వారికి రీజాయినింగ్

- డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీ రావు

బొబ్బిలి: పదో తరగతి పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు పాఠశాలల్లో రీజాయినింగ్ విధానాన్ని తీసుకు వచ్చినట్లు డిప్యూటీ డీఈఓ పి బ్రహ్మజీరాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతి తప్పిన విద్యార్థులకు ప్రామాణికాలు పెంచి వారిని ఉత్తీర్ణులను చేసేందుకు మరింత శ్రద్ధ వహించనున్నట్లు చెప్పారు. బొబ్బిలి డివిజన్‌లో ఇలా తప్పిన విద్యార్థులు పది మండలాల్లో 748 మంది ఉన్నట్లు గుర్తించామని వారిని ఆయా పాఠశాలల్లో చేర్పించి పదో తరగతి ఉత్తీర్ణత సాధించేలా తర్ఫీదునిచ్చి వారికి అమ్మ ఒడి నిధులు కూడా తల్లుల ఖాతాల్లో మళ్లీ జమ చేయనున్నామన్నారు.

**పేద పిల్లలకు ప్రైవేట్‌లో 25 శాతం సీట్లు:** జిల్లాలో తెల్ల రేషన్ కార్డున్న పేద పిల్లలకు 3 కిలోమీటర్ల లోపున్న ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించేందుకు చర్యలు తీసుకున్నామని డిప్యూటీ డీఈఓ బ్రహ్మజీరావు తెలిపారు. లాటరీ ద్వారా ఈ సీట్లు కేటాయించి, ఫీజులు లేకుండా విద్యనందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## తుస్సుమన్న బస్సుయాత్ర

- కళా, ప్రతిభాభారతిల గైర్హాజరు


రాజాం ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డులో జనాలు లేని టీడీపీ బస్సుయాత్ర

రాజాం: భవిష్యత్ గ్యారంటీ నినాదంతో టీడీపీ నిర్వహిస్తున్న బస్సు యాత్ర రాజాంలో తుస్సుమంది. బొబ్బిలిరోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం బస్సుయాత్రను టీడీపీ రాజాం ఇన్‌చార్జ్ కోండ్రు మురళీమోహన్ ప్రారంభించారు. దగ్గరలో ప్రధాన రహదారిపై సమావేశం నిర్వహించిన అనంతరం కొంతదూరం ర్యాలీచేశారు. అనంతరం కార్యకర్తలు ద్విచక్రవాహనాలపైన, నేతలు బస్సులో యాత్ర చేపట్టారు. రాజాం సామాజిక ఆస్పత్రి వద్ద సెల్ఫీ దిగారు. అంబేడ్కర్ జంక్షన్ మీదుగా సంతకవిటి మండలంలోని బొద్దూరు, గుళ్లసీతారాంపురం గ్రామాలకు యాత్ర చేరుకుంది. రాజాం సామాజిక ఆస్పత్రి వద్దకు వచ్చే సమయానికి కార్యకర్తలు కొంతమంది మెల్లగా జారుకోవడంతో బస్సు ముందు కొద్దిమంది కార్యకర్తలుమాత్రమే ద్విచక్రవాహనాలతో కనిపించారు. రాజాం నియోజకవర్గానికి చెందిన టీడీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కిమిడి కళా వెంకటరావు, పొలిట్ బ్యూరో సభ్యురాలు కావలి ప్రతిభాభారతి ఈ యాత్రలో కనిపించలేదు. రాజాం, రేగిడి మండలాలకు చెందిన టీడీపీ ప్రధాన నేతలు కూడా యాత్రలో కనిపించకపోవడంతో యాత్ర నీరుగారిపోయింది.

## విత్తనాలు ,ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

విజయనగరం ఫోర్ట్: విత్తనాలు, ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తవలస సబ్‌డివిజన్ ఏడీఏ ఎల్.విజయ స్పష్టం చేశారు. విజయనగరంలోని విత్తనాలు దుకాణాలను శుక్రవారం ఆమె మండల వ్యవసాయ అధికారి ఉమ మహేశ్వరావుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కర్షకరత్న, కర్షక ఆనంద్ అగ్రో కెమికల్స్ విత్తనాల దుకాణాలను పరిశీలించారు. విత్తనాల శాంపిల్స్ తీసి నాణ్యతను పరీక్షించడానికి ల్యాబ్‌కు పంపించారు. కర్షక ఆనంద్ అగ్రో కెమికల్స్ దుకాణంలో వరి విత్తనాలకు సంబంధించి ఎస్‌పి7373 రకం ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేకుండా విక్రయిస్తున్నట్లు గుర్తించి ఐదు రోజుల పాటు విక్రయాలు నిలిపివేతకు ఆదేశించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ దామోదర్ పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్


పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎస్.కోట పోలీసులు

శృంగవరపుకోట: ఒడిశా రాష్ట్రం నుంచి అక్రమంగా తరలివస్తున్న గంజాయిని ఎస్.కోట పోలీసులు మాటువేసి పట్టుకుని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌చార్జ్ సీఐ బాలసూర్యారావు వివరాలు తెలిపారు. ఉదయం వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు అనంతగిరి నుంచి ఎస్.కోట వస్తున్న ఇన్నోవాను నిలిపి సోదాలు చేయగా వాహనంలో తరలిస్తున్న 155 కిలోలు గంజాయి పట్టుబడింది. ఒడిస్సా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లా, పనసపుట్ మండలం, మూలపుట్ గ్రామానికి చెందిన రామ్‌నాథ్ ఖితో కొండ ప్రాంతంలో గంజాయిని పండించి, మహరాష్ట్రలో భివాండీతాణా పరిధిలో గల గుల్జార్‌నగర్ ప్రాంతానికి చెందిన ఫరూఖ్ ఖురేషి, అతీఖ్‌అహ్మద్ రఫీఖ్‌షేక్‌లకు రూ.2లక్షలకు విక్రయించాడు. గంజాయి కొనుగోలు చేసిన వారు ఇన్నోవాలో వస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా నిందితుల దగ్గర 3మొబైల్ ఫోన్లు, 155కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశామని, పట్టుబడిన గంజాయి విలువ బహిరంగమార్కెట్‌లో రూ.6,20,000లు ఉంటుందని ఆయన వివరించారు.

**బొబ్బిలిలో మరొకరు..**

బొబ్బిలి: పట్టణంలో గంజాయితో సంచరిస్తున్న మైసూరుకు చెందిన మురుగన్ అలియాజ్ గిరిధర్‌ను అరెస్టు చేసినట్టు ఎస్సై చదలవాడ సత్యనారాయణ విలేకరులకు తెలిపారు. రైల్వేస్టేషన్ జంక్షన్ ప్రాంతంలో గంజాయితో తిరుగుతున్న వ్యక్తిని పట్టుకుని ప్రశ్నించి అరెస్టు చేశామన్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని చెప్పారు.

## లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- జంగారెడ్డిగూడెం నుంచి విశాఖ వెళ్తుండగా ప్రమాదం
- 30 మంది ప్రయాణికుల్లో నలుగురికి గాయాలు
- కశింకోట ఆర్ఈసీఎస్ వద్ద ఘటన


కశింకోట వద్ద రోడ్డు పక్కన బోల్తాపడిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు

కశింకోట: అనకాపల్లి జిల్లా కశింకోట ఆర్ఈసీఎస్ ప్రధాన కార్యాలయం వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు, లారీ ఢీకొన్న ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరు మహిళలు, మరో ప్రయాణికుడు, బస్సు డ్రైవర్ ఉన్నారు. ఎస్ఐ ఎ. ఆదినారాయణరెడ్డి వివరాల ప్రకారం... ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు అక్కడి నుంచి విశాఖపట్నం వస్తోంది. ఈ క్రమంలో స్థానిక ఆర్ఈసీఎస్ ప్రధాన కార్యాలయం వద్ద ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి వచ్చి ఢీకొంది. దీంతో అదుపు తప్పి రోడ్డు పక్కనున్న పల్లపు ప్రాంతంలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం అంటిపేట గ్రామానికి చెందిన బక్కు గౌరీశ్వరి, విజయనగరం జిల్లా మెంటాడ మండలం పెదసామాలపల్లి గ్రామానికి చెందిన జరజాపు సావిత్రి, జంగారెడ్డిగూడెంకు చెందిన కేతిరెడ్డి సత్యనారాయణ గాయపడ్డారు. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో డ్రైవర్ బుక్కా శ్రీనివాసరావు బస్సు కేబిన్‌లో చిక్కుకోవడంతో స్థానికులు బయటకు తీశారు. క్షతగాత్రులను హైవే పోలీసుల సహాయంతో అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం స్వల్ప గాయాలు కావడంతో తమ గమ్యస్థానాలకు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. సురక్షితంగా బయటపడిన 26 మందిని వేరే బస్సులో గమ్యాలకు తరలించారు. బస్సు ముందు భాగం దెబ్బతింది. అద్దాలు పూర్తిగా పగిలిపోయాయి. దాన్ని క్రేన్ సహాయంతో స్థానిక ఆర్టీసీ బస్సు స్టేషన్‌కు తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## నేడు పంటలబీమా విడుదల

- వ్యవసాయ అధికారి తారకరామారావు

విజయనగరం ఫోర్ట్: రైతు దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం శనివారం పంటల బీమా సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేయనుందని జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అనంతపురం జిల్లా కల్యాణ దుర్గంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. జిల్లాకు సంబంధించి 2019–20 నుంచి 2023 వరకు 37, 173 మంది రైతులకు రూ. 32.58 కోట్లు రైతుల ఖాతాలలో జమ చేసినట్లు చెప్పారు.

## జాతర మహోత్సవాలకు పందిరిరాట


పందిరిరాట మహోత్సవంలో పూజలు నిర్వహిస్తున్న కొండబాబు, తదితరులు

విజయనగరం టౌన్: హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దచెరువు గట్టుపై వెలిసిన శ్రీ విజయసాగర దుర్గమ్మ తల్లి జాతర మహోత్సవాలు పందిరిరాటతో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అసోసియేషన్ అధ్యక్ష్య,కార్యదర్శులు దవడ మీనా, కొండబాబు, కోశాధికారి స్రవంతిలతో పాటు భక్తులు పందిరిరాట మహోత్సవంలో పాల్గొని, విశిష్ట పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో ఆనందంగా ఉండాలని జాతర మహోత్సవాల్లో వేప,రావిచెట్లకు కల్యాణం నిర్వహిస్తున్నామని చెప్పారు. 8న శనివారం సాయంత్రం 6 గంటలకు కల్యాణం జరగనుందని తెలిపారు. 9న ఆదివారం సాయంత్రం 5 గంటలకు కోట వద్ద నుంచి ఏడుఎడ్ల బండ్లపై ఆషాడం సారె తరలించి అమ్మవారికి సమర్పిస్తామని భక్తులందరూ అమ్మవారిని దర్శించి, తరించాలని కోరారు.

### కోడిగుడ్ల ధరలు

| హోల్‌సేల్ ధరలు | (100 గుడ్లు) |
|---|---|
| విశాఖపట్నం | రూ. 475.00 |
| విజయనగరం | రూ. 479.00 |
| శ్రీకాకుళం | రూ. 479.00 |

### బులియన్

| విశాఖపట్నం | |
|---|---|
| బంగారం(24సి. 10గ్రా.) | 59,160-00 |
| బంగారం(22సి. 10గ్రా.) | 54,250-00 |
| వెండి (కిలో) | 76,700-00 |

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹117 | ₹204 | ₹ 214 |

## సాక్షి క్లాసిఫైడ్స్

**FLAT FOR SALE**

■ VZM టౌన్ కోట దగ్గర గుండాలవారి వీధి, రామకృష్ణ నిలయం నందు 1011 Sft 2 BHK ఫ్లాట్ అన్ని సౌకర్యాలతో అమ్మకానికి కలదు. డైరెక్ట్ పార్టీ. ఫోన్: 99584 36488, 79828 28484 [V- 1986]

■ 2 BHK 1055 Sft Flats For Sale Pradeepnagar, VZM. Ready to Occupy N/E/W Facings with Car parking, Lift, Generator. Ph : 99635 51623, 98494 06219 [V-1998]

**SITE FOR SALE**

■ 250 గజాలు, 40 ఫీట్ రోడ్, వుడా అప్రూవ్డ్ (LRS), సాయి కీర్తన నగర్ లే అవుట్, KL పురం & 60 గజాలు కనపాక మధుర అయ్యన్నపేట, ఊటి రాజు గారి లేవుట్, విజయనగరం. అమ్మకంనకు కలవు వెస్ట్ ఫేసింగ్స్. ఫోన్ : 9247775268. [S-1195885]

**WANTED**

■ కష్టలెస్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 12000-35000/-, ఫ్రీ రూమ్+భోజనం. Hyd. ఫోన్: 8919613984. [HA-366]

**FACULTY TEACHER**

■ We need Lady Faculty for classes Nursery, L.K.G, U.K.G, Qul: Degree (English must), Sal: negotiable (6000/-), Pradeep Nagar, VZM. Cont: 9866240948. [C-1216571]

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.